
AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatodaynews.com


## డీఆర్వోను కలిసిన జీజీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా రెవెన్యూ అధికారిణిగా గీత ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను కలెక్టరేట్‌లోని ఆమె ఛాంబర్‌లో మంగళవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ నాగమోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌లో అందిస్తున్న సేవలను, కొత్తగా నిర్వహిస్తున్న సర్జరీ విషయాలను ఆయన ఆమెకు తెలియజేశారు.


18-5-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## నిబంధనల మేరకే ఇసుక రవాణాకు అనుమతులు: కలెక్టర్



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే జిల్లాలో ఇసుక రవాణాకు అనుమతులు జారీ చేయడం జరుగుతోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించబోమని, ఇసుక అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా సంబంధిత శాఖల ద్వారా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. పర్యావరణ అనుమతులు లభించిన తర్వాతే పోతంగల్ మండలం హంగర్గా గ్రామ శివారులోని మంజీరా నది నుండి ఇసుక రవాణాకు అనుమతించడం జరిగిందని తెలిపారు. టీజీఎండీసీ ద్వారా నిబంధనలను పక్కాగా పాటిస్తూ ఇసుక రవాణా కొనసాగుతోందని, తన ఆదేశాల మేరకు బోధన్ ఆర్డీవో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి ఈ మేరకు నివేదిక అందించారని అన్నారు. వే బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతోందని, ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకే ఇసుక వాహనాలకు అనుమతిస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. టీజీఎండీసీ ద్వారా కొనసాగుతున్న కార్యకలాపాలను నిశితంగా పర్యవేక్షించడం జరుగుతోందని, తూకంలో తేడా లేకుండా, ఓవర్ లోడ్‌కు ఆస్కారం లేకుండా సీసీ కెమెరా ద్వారా నిఘా ఏర్పాటు చేశామని, జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా ఇసుక లోడ్‌తో వెళ్తున్న వాహనం వెళ్లే దారిని ఆన్‌లైన్‌లో టీజీఎండీసీ ప్రధాన కార్యాలయంలో గమనించడం జరుగుతోందన్నారు. జిల్లాలోని మిగతా ఇసుక రీచ్‌ల నుండి మన ఇసుక వాహనం ఆన్‌లైన్ బుకింగ్ యాప్ ద్వారా ట్రాక్టర్లలో ఇసుక రవాణాకు అనుమతించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

## రెండున్నరేళ్లుగా హామీలు అమలు చేయని కాంగ్రెస్



**అక్షరటుడే, కామారెడ్డి:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్ నాయక్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సోమవారం మాట్లాడారు. ఈనెల 26న ఇందిరాపార్క్‌లో నిర్వహించే మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే సమక్షంలో చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించారన్నారు. డిక్లరేషన్‌లో 12 హామీలు ఇచ్చారని, రెండున్నరేళ్లయినా ఆ హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. ఎస్టీలకు సేవాలాల్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్నారని, గోండు, కోయలకు కొమురంభీం కార్పొరేషన్, ఎరుకలకు ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏటా రూ.750 కోట్లు కేటాయిస్తామన్నారని తెలిపారు. రాష్ట్రంలోని మహబూబాబాద్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలో మైదాన ప్రాంతాల్లో ఐదు ఐటీడీఏలు ఏర్పాటు చేస్తామన్నారన్నారు. కానీ ఒక్కహామీనీ ఇప్పటివరకు నెరవేర్చకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నునావత్ గణేష్ నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాణా ప్రతాప్ రాథోడ్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ జాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రి నాయక్, గౌరవ అధ్యక్షుడు రూప్ సింగ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి రవీందర్ నాయక్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు మోహన్ నాయక్, ప్రధాన కార్యదర్శి గంగాధర్ పాల్గొన్నారు.



కామారెడ్డి జిల్లా కేంద్రం అక్రమ నిర్మాణాలను అడ్డాగా మారుతోంది. ముఖ్యంగా చెరువులు, కుంటలను కబ్జా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో వర్షపు నీరు సాఫీగా చెరువులు, కుంటల్లోకి వెళ్లకుండా జనావాసాల్లోకి చేరి ఆగం చేస్తోంది. గతేడాది జరిగిన వరద ఘటనే ఇందుకు నిదర్శనంగా చెప్పకోవచ్చు. అయితే అధికారులు ఇప్పటికి దిద్దుబాటు చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. - అక్షరటుడే, కామారెడ్డి

# చెరువుల పక్కనే నిర్మాణాలు

■ ఇష్టారాజ్యంగా చేపడుతున్న వైనం ■ అనుమతులు ఇస్తున్న అధికారులు ■ ముంచుతున్న వరదలు ■ అక్రమ కట్టడాలపై చర్యలు చేపట్టేదెన్నడు..!

కామారెడ్డి పట్టణంలో గతేడాది ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు పట్టణం చిగురుటాకులా వణికిపోయింది. జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. జీఆర్ కాలనీలో మొదటి అంతస్తు వరకు నీళ్లు చేరి సామాన్లన్నీ కొట్టుకుపోయాయి. కౌండిన్య కాలనీ మూడు రోజుల పాటు నీటిలోనే ఉండిపోయింది. బోట్లతో ప్రజలను తరలించాల్సి వచ్చింది. ఆ గాయం నుంచి ఇప్పటికీ ఆ రెండు కాలనీల ప్రజలు కోలుకోలేదు. ఆకాశంలో మబ్బు పడితే చాలు గుండె గుబేల్‌మంటోందని కాలనీ వాసులు వాపోతున్నారు.

### కాలువలు ఆక్రమించి..

పట్టణ శివారులో ఉన్న పెద్ద చెరువు, చిన్న చెరువు, కుంటకు వెళ్లే వరద కాలువలను ఆక్రమించి వెంచర్లు వెలిశాయి. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిబంధనలు గాలికొదిలేశారు. చెరువు శిఖం భూముల్లోనే లేఅవుట్లకు అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. నీరు వెళ్లడానికి దారి లేకపోవడంతో వరద అంతా కాలనీల్లోకి మళ్లింది. అయినా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారు. పట్టణంలో 60 ఫీట్లు ఉండాల్సిన కాలువ 10 ఫీట్లకు కుంచించుకుపోయింది. ఇరువైపులా అపార్ట్‌మెంట్లు వెలిశాయి. కాల్వపైనే స్లాబ్ వేసి షాపింగ్ కాంప్లెక్స్‌లు కట్టారు. దీంతో నీరు వెనక్కి తన్ని దేవునిపల్లి, వినాయక్‌



నగర్ మునిగాయి. కుంట కాలువ పూర్తిగా మూసేసి ఇళ్ల స్థలాలుగా మార్చేశారన్న ఆరోపణలున్నాయి. ఫలితంగా శివారు కాలనీలన్నీ జలమయమయ్యాయి.

### విచారణ లేకుండా అనుమతులు?

ఒక ఇంటి నిర్మాణం చేసేటప్పుడు మున్సిపల్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. అయితే అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరపకుండానే అనుమతులు జారీ చేసినట్టుగా ఆరోపణలున్నాయి. ఇరిగేషన్, రెవెన్యూ నుంచి ఎన్‌వోసీ లేకుండానే మున్సిపాలిటీ లేఅవుట్ అనుమతులు ఇచ్చిందని ఆరోపణలున్నాయి. దీనిపై అధికారులు పకడ్బందీగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్న టాక్ వినిపిస్తోంది.

### మాక్ డ్రిల్‌తో అవగాహన

వరుస వరదలతో ప్రజల్లో నెలకొన్న భయాన్ని పోగొట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు ముందుకొచ్చారు. లోతట్టు ప్రాంతాలైన జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీలలో వరదల సమయంలో ఎలా వ్యవహరించాలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఫైర్, రెవెన్యూ సిబ్బందితో కలిసి వరద సహాయక చర్యలు, పునరావాస కేంద్రాలకు తరలింపు, ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్నారు. సైరన్ మోగితే ఏం చేయాలి, ముఖ్యమైన సర్టిఫికెట్లు ఎలా కాపాడుకోవాలి, ఎక్కడికి వెళ్లాలి అనే అంశాలపై ప్రతి కాలనీలో డెమో ఇస్తున్నారు.

### ఇకనైనా మేల్కొంటారా?

కామారెడ్డిలో వర్షం పడిన ప్రతీసారి ఇదే పరిస్థితి నెలకొంటుంది. వర్షం పడితే కాలనీలు, రోడ్లన్నీ మునిగిపోతున్నాయి. గతేడాది వరదల తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు వచ్చి కాలువల ఆక్రమణలు తొలగిస్తామని హామీ ఇచ్చారు. సంవత్సరం గడుస్తున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. అధికారులు వచ్చి ఫొటోలు దిగి వెళ్తారు. నష్టపరిహారం ఇస్తామని, తూతూమంత్రంగా ఆదుకుంటామని చెప్పినా ఇప్పటికీ అది అందలేదన్న విమర్శలు పట్టణ ప్రజల నుంచి వస్తున్నాయి.

### అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలి




పట్టణంలో కొత్తగా నిర్మించే ఇళ్ల నిర్మాణాల విషయంలో అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అనుమతులు ఇవ్వకూడదు. ఇప్పటికి ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలి. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. కౌండిన్య, జీఆర్ కాలనీలలో చెరువు కాల్వల పక్కన నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను కూల్చివేసి కాలువలను పునరుద్ధరించి వరదలు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.

– విఠల్, విద్యార్థి సంఘ నాయకుడు

## పోతంగల్ తహశీల్దార్‌గా సందీప్



**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ తహశీల్దార్‌గా సీహెచ్ సందీప్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో డీటీగా పనిచేస్తూ.. పదోన్నతిపై పోతంగల్ తహశీల్దార్‌గా వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న విష్ణు నిజామాబాద్ కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది తహశీల్దార్ సందీప్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయబ్ తహశీల్దార్ హజీజ్, ఆర్ఐ సయ్యద్ హుస్సేన్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై విరిగిపడ్డ చెట్ల కొమ్మలు



తడిచిన ధాన్యం రాశులు

## ఎల్లారెడ్డిలో భారీ వర్షం..

### విరిగిపడ్డ చెట్లు, తడిసిన ధాన్యం రాశులు..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మండలంలో సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా ఈదురు గాలులతో కూడిన భారీవర్షం బీభత్సం సృష్టించింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న ధాన్యం కుప్పలు తడిసి ముద్దయ్యాయి. ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు సైతం ఈదురు గాలులకు ఎగిరిపోవడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. బలంగా వీచిన ఈదురుగాలుల ధాటికి ఎల్లారెడ్డి-కామారెడ్డి ప్రధాన రహదారిపై అనేక చెట్లు, కొమ్మలు విరిగిపడ్డాయి. అయితే రోడ్డుపై భారీగా కొమ్మలు పడడంతో రాకపోకలు స్తంభించాయి. ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ వెంటనే స్పందించి వెంటనే తొలగింపు చర్యలు చేపట్టారు. ఈదురు గాలులకు గండి మాసానిపేట్ గ్రామంలో విద్యుత్ తీగలు తెగిపడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల రేకుల షెడ్లు సైతం ధ్వంసమయ్యాయి. మరోవైపు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాతావరణశాఖ మరో రెండు రోజులు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలపడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కాగా.. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.





ధ్వంసమైన రేకుల షెడ్డు





## రేవంత్ మరో సువేందు అవుతారేమో: ఎంపీ అర్వింద్

**అక్షరటుడే, ఇందూరు:** సీఎం రేవంత్ రెడ్డికి, ప్రధాని మోదీకి ఏమైనా లింకులు ఉన్నాయేమో అని ఎంపీ అర్వింద్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బెంగాల్‌లో సువేంద్ అధికారిలా మోదీ, రేవంత్ కలుస్తారేమోనని అర్వింద్ అన్నారు. అందుకే నాతో కలిసి పని చేయి అన్నారేమో అని అనుమానం వ్యక్తం చేశారు. కాగా.. బెంగాల్‌లో సువేంద్ అధికారి తృణమూల్ నుంచి బీజేపీలో చేరారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తనతో కలిసి పని చేయాలని రేవంత్‌రెడ్డిని మోదీ కోరారు. ఈ క్రమంలో ఎంపీ అర్వింద్ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన పీఎం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిని బీజేపీలోకి రావాలని ఆహ్వానించిన సందర్భంగా ఎంపీ పై వ్యాఖ్యలు చేశారు. 2039 వరకు రాహుల్ గాంధీ ప్రధాని కారని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని.. అంటే రాహుల్ ఇక ప్రధాని కాలేరని.. ఇంకో పదేళ్లు దేశంలో బీజేపీ ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డే ఒప్పుకున్నారన్నారు. రేవంత్ రెడ్డికి బదులు కోమటి రెడ్డి, శ్రీధర్‌బాబు లాంటి వాళ్లను సీఎం చేయాలని కాంగ్రెస్‌కు సూచించారు. వారైతే మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నిజామాబాద్ జిల్లాకు పంగనామాలు పెట్టాడని ఎంపీ విమర్శించారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కేందుకు ముఖ్యమంత్రి జిల్లాకు మొండిచేయి చూపుతున్నారని వ్యాఖ్యానించారు. ఇంకా ఏం ముఖం పెట్టుకొని మహేష్ కుమార్ గౌడ్ జిల్లాలో తిరుగుతున్నారో అర్థం కావట్లేదని అన్నారు.





నిజామాబాద్‌కు అవుటర్ రింగ్ రోడ్డు ఇస్తా అని హామీ ఇచ్చిన సీఎం తర్వాత మరిచిపోయారన్నారు. ఇందూరు ప్రజలను మోసం చేస్తే భవిష్యత్తులో వారు బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. దేవుళ్లను మోసం చేసిన వాడికి ప్రజలు ప్రజలను మోసం చేయడం పెద్ద లెక్క కాదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హయాంలో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు పూర్తికావని జోస్యం చెప్పారు. ఇప్పటివరకు 25 శాతం పనులు కూడా పూర్తికాలేదని.. రూ.162 కోట్లకుగాను కేవలం రూ.10 కోట్ల నిధులు మాత్రమే యూజీడీకి ప్రభుత్వం కేటాయించిందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే ధన్‌పాల్, పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, నాయకులు స్రవంతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుజ్జుల్ డ్యామ్ మరమ్మతు పనులు ప్రారంభం



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని గుజ్జుల తండా గ్రామ పంచాయతీ పరిధిలో గుజ్జుల్ డ్యాం మరమ్మత్తు పనులు సోమవారం ప్రారంభించినట్లు తండా సర్పంచ్ రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుజ్జుల్ డ్యాం మరమత్తు పనుల నిమిత్తం ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే నిధులు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు బియ్యం పంపిణీ



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో జిరాయత్‌నగర్‌లోని విద్యా హైస్కూల్‌లో రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఐదుకిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. 'అవ్వకు బువ్వ' కార్యక్రమంలో ప్రతినెలలో నిరుపేదలకు తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు. ఈ క్రమంలో సోమవారం సుమారు 65 మందికి ఐదు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ ఖాందేష్, ప్రధాన కార్యదర్శి విద్యా ప్రవీణ్ పవార్, ఉపాధ్యక్షులు జిందం నరహరి, ఎస్ జీ శ్రీకాంత్, కోశాధికారి గోనె శ్రీధర్, కార్యనిర్వహక కార్యదర్శులు తులసీ పట్వారి, ఖాందేష్ సత్యం, సభ్యులు ఖాందేష్ గంగాధర్, ప్రవీణ్, ఖోడే శ్రీనివాస్, మక్కల సాయి కుమార్, బండారి నరేశ్, మహేష్, శ్రీను రాజేష్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఏపీడీ



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీడీ విజయలక్ష్మి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు ఆమెతో మాట్లాడుతూ.. లారీలు రాకపోవడంతో ధాన్యం బస్తాలు కొన్నిరోజులుగా ఇక్కడే ఉండిపోయాయని పేర్కొన్నారు. ఆరు రోజులకు ఒక లారీ వస్తోందని.. ఇలా ఎన్నాళ్లు ధాన్యాన్ని తరలిస్తారని రైతులు వాపోయారు. దీంతో ధాన్యాన్ని త్వరగా రైస్‌మిల్లులకు తరలిస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం వినోద్, సీసీ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# లారీలు రావు.. ధాన్యం పోదు..



- ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా సాగక అన్నదాత అవస్థలు
- 20 రోజులుగా వడ్ల కుప్పల వద్దే పడిగాపులు

**పంట పండించేందుకు ఆరుగాలం పడిన కష్టం ఒకెత్తయితే.. పంట చేతికొచ్చాక విక్రయించడం అన్నదాతలకు మరో ఎత్తవుతోంది. పంట కోసి నెలరోజులవుతున్నా కొనుగోళ్లు ముందుకు సాగడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 20 రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు కాయాల్సి వస్తోందని వాపోతున్నారు. మరోవైపు వర్షాలు కురుస్తుండడంతో పంట తడిచి నష్టపోతామని ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరుతున్నారు.** – అక్షరటుడే, ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలో ధాన్య విక్రయాలకు ఇక్కట్లు తప్పట్లేదు. కలెక్టర్, ఎస్పీ స్థాయి అధికారులు హెచ్చరించినప్పటికీ లారీలు కదలట్లేదని.. ధాన్యం తరలించడం సాధ్యం కావట్లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తుండడంతో తమ పరిస్థితి ఏమిటని వారు వాపోతున్నారు. మరోవైపు దళారులు, లారీ డ్రైవర్లు రైతులను నిలువునా దోచుకుంటున్నారని.. వర్షాలకు ముక్కిన ధాన్యాన్ని రైస్ మిల్లుకు తరలించాలంటే అదనంగా రూ.5000 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాలోత్ తండాకు చెందిన ఓ రైతు తాను డబ్బులిస్తేనే ముక్కిన ధాన్యాన్ని సైతం రైస్ మిల్లులో ఖాళీ చేసి ట్రక్ షీట్‌ను ఇచ్చారని.. లేకపోతే ట్రక్ షీట్ ఇవ్వలేదని వాపోయారు.

### బస్తాకు రూ.2 ఇవ్వాల్సిందే..

తూకం వేసిన ధాన్యం బస్తాలను రైస్ మిల్లులకు తరలించాలంటే లారీ డ్రైవర్లకు బస్తాకు రూ.2 చొప్పున చెల్లిస్తేనే లారీలను కదిలిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతి లారీకి రూ.వెయ్యి ఇస్తే గానీ లారీ కొనుగోలు కేంద్రం దాటట్లేదని పరమల్లకు చెందిన రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పంట పండించడం కంటే విక్రయించడానికే ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

### 40 కిలోల బస్తాకు 2.250 కిలోల తరుగు

40 కిలోల ధాన్యం బస్తాకు రెండు కిలోల పావు వరకు తరుగు తీస్తున్నారు. క్వింటాలుకు 5 కిలోల వరకు తరుగు తీయడంతో పాటు లారీ లోడుకు అదనంగా 6 క్వింటాళ్ల నుంచి 8 క్వింటాళ్ల ధాన్యం బస్తాలను తరుగు, పొల్లు పేరుతో రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని కర్షకులు కన్నీరు పెడుతున్నారు.



తేమ, తరుగు పేరుతో అడ్డగోలుగా కోతలు విధిస్తూ దళారులు, మిల్లర్లు సిండికేట్‌గా మారి రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆవేదన చెందుతున్నారు.

### ఎదురుచూపులు..

ధాన్యం బస్తాలు తూకం వేసి 20 రోజులవుతున్నా వాహనాలు రావడం లేదు. తూకం వేసిన బస్తాలకు సైతం రైతులే బాధ్యులని చెబుతుండడంతో బస్తాలను చూసుకుంటూ రాత్రింబవళ్లు ఎండకు వానకు అష్టకష్టాలు పడుతున్నారు. కొనుగోళ్ల తిప్పలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు మాల్తుమ్మెద, భవానీపేట్ కొండాపూర్ రైతులు రోడ్డెక్కారు. ప్రభుత్వం పంటను తరలించే ఏర్పాట్లు కూడా ప్రభుత్వం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట విక్రయించే వరకు వేరే పనులకు వెళ్లకుండా కల్లాల వద్ద ఉండాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇకనైనా లారీలను సక్రమంగా ఏర్పాటు చేసి ధాన్యం రవాణా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

### డబ్బులు ఇస్తేనే ట్రక్‌షీట్..

కొనుగోలు కేంద్రాల్లో డబ్బులు ఇస్తేనే ట్రక్ షీట్ ఇస్తున్నారని.. అప్పుడే లారీ కదులుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. డబ్బులివ్వకపోతే కల్లాల్లోనే ధాన్యం పడి ఉంటోందని చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని, దళారుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. తరుగు పేరుతో జరుగుతున్న దోపిడీపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో ఇటీవల పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వివరాలు తెలియజేశారు. ఆర్మూర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల పలువురు తమ ఫోన్లను పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని రికవరీ చేసి బాధితులైన భీమా గౌడ్, శ్యాంసుందర్ నర్సింలు, ఉమేష్, గోపాల్, పుట్ట మోహన్, రాహుల్, మాధవరావు, వీరయ్యలకు వాటిని అందజేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## కోరిక తీరిస్తేనే ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తానని వేధింపులు..

### కాంగ్రెస్ నాయకుడిపై పోలీసులకు మహిళ ఫిర్యాదు

**అక్షరటుడే, కామారెడ్డి:** ఇందిరమ్మ ఇల్లు కావాలంటే తన కోరిక తీర్చాలంటూ ఓ కాంగ్రెస్ నాయకుడు వేధిస్తున్నాడని ఓ మహిళ తన గోడు వెళ్లబోసుకుంది. చివరకు బాధిత మహిళ పోలీస్ స్టేషన్ మెట్లెక్కింది. ఈ ఘటన రాజంపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఈ మేరకు ఆమె సోమవారం వివరాలు వెల్లడించింది. రాజంపేటకు చెందిన బాధిత మహిళకు ఇల్లు కూలిపోయి రెండేళ్లుగా అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. ఇందిరమ్మ ఇల్లు కావాలని నాయకులకు మొరపెట్టుకుంది. అయితే సదరు కాంగ్రెస్ నాయకుడు తన కోరిక తీరిస్తేనే ఇల్లు మంజూరు చేయిస్తానని చెప్పడంతో ఆమె నిరాకరించింది. దీంతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరు జాబితాలో బాధిత మహిళ పేరు వచ్చినా సదరు కాంగ్రెస్ నాయకుడు క్యాన్సిల్ చేయించాడని పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. తనకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమని పేర్కొంది. ప్రస్తుతం ఈ అంశం కాంగ్రెస్ పార్టీని కుదిపేస్తోంది. సదరు నాయకుని తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే తనపై వచ్చిన ఆరోపణలపై సదరు నాయకుడు స్పందించారు. తాను ఏ తప్పు చేయలేదన్నారు. ఆమెకు ఇల్లు కూలిపోతే పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. అయితే ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత తనకు లేదని, డబుల్ బెడ్ రూం మంజూరు చేయాలని కోరితే మొదటి లిస్టులోనే ఆమెకు ఇల్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. అయితే కొందరు వ్యక్తులు సంబంధిత అధికారులకు చెప్పి ఆమె పేరు క్యాన్సిల్ చేయించారన్నారు. అయితే రాజంపేటలో వర్షాలు పడి ఓ మహిళ ఇల్లు కూలిపోతే ఆమెకు రూ.10 వేలు ఆర్థిక సహాయం ఇప్పించామన్నారు. అలాగే ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేయిస్తామని తమ మాజీ అధ్యక్షుడు హామీ ఇచ్చారన్నారు. అయితే ఆ మహిళకు ఇల్లు ఎలా మంజూరు చేస్తారని తన ఎందుకు ఇవ్వరని పేర్కొంటూ బాధిత మహిళ తనను ఆర్నెళ్లుగా మానసికంగా వేధిస్తోందని తెలిపారు. తాను 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నానని, ఎవరికీ అన్యాయం చేయలేదన్నారు. ఈ విషయమై పోలీసులు నిష్పక్షపాత విచారణ జరిపించాలని కోరారు. తాను తప్పు చేస్తే దేనికైనా సిద్ధమేనని పేర్కొన్నారు.

## కువైట్‌లో గుండెపోటుతో వేల్పూర్ వాసి మృతి



**అక్షరటుడే, భీమ్‌గల్ (వేల్పూర్):** బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటనతో మండలంలోని రామన్నపేట్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట్ గ్రామానికి చెందిన అశోక్ (48) మాదిగ సంఘం మాజీ అధ్యక్షుడిగా, ఏవైఎస్ కార్యవర్గ సభ్యుడిగా సేవలందించాడు. ఉపాధి నిమిత్తం కొన్ని రోజుల క్రితమే ఆయన కువైట్ వెళ్లాడు. అక్కడ అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచాడు. అశోక్ మరణ వార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అశోక్ మృతితో రామన్నపేట్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## తాడ్వాయిలో చిరుత కలకలం.. లేగ దూడలపై దాడి..



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తాడ్వాయి మండలంలో చిరుత దాడి ఘటన కలకలం రేపింది. మండలంలోని నందివాడ పరిధిలో గల సామ దుబ్బ తండాలో ఆదివారం రాత్రి లేగ దూడలపై చిరుత దాడి చేసింది. బాధితుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన రైతు రమావత్ రమేష్ ఆదివారం రాత్రి తన లేగ దూడలను ఇంటి పక్కనే ఉన్న పశువుల పాకలో కట్టేశాడు. అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా దాడి చేసిన చిరుత పులి పాకలో ఉన్న రెండు లేగదూడలను అక్కడికక్కడే హతమార్చింది. మరో దూడను కొంతదూరం లాక్కెళ్లి చంపేసింది. ఈ దాడిలో తనకు సుమారు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని, కష్టం చేసుకుని బతికే తనను ప్రభుత్వం, అధికారులు ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు రమేష్ విజ్ఞప్తి చేశాడు. చిరుత దాడుల్లో మూడు దూడలు చనిపోవడంతో తండాలో భయాందోళన నెలకొన్నాయి. తరచూ అటవీ ప్రాంతం నుంచి చిరుతలు, ఇతర క్రూరమృగాలు జనావాసాల్లోకి వస్తున్నాయని, పశువులపై దాడులు చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుత సంచారాన్ని అరికట్టాలని, బాధిత రైతుకు నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. రాత్రిపూట ఆరుబయట తిరగాలంటే భయపడాల్సిన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఎగ్జిబిషన్‌లో ప్రమాదం.. విరిగిన క్రేజీ వీల్ ట్రాలీ..



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో ప్రమాదాలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఆహ్లాదాన్ని అందించాల్సిన ఎగ్జిబిషన్ సందర్శకులను ఇబ్బందులను గురిచేస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఆదివారం రాత్రి క్రేజీవీల్ ట్రాలీ ఊడిపడి ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. నగరంలో ఏర్పాటు చేసిన నుమాయిష్‌కు జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు వస్తుంటారు. వేసవి సెలవుల దృష్ట్యా సందర్శకుల తాకిడి ఎక్కవగానే ఉంటుంది. అయితే నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు పదిరోజుల క్రితం ఓ మహిళ గుండెపోటుతో మృతి చెందింది. తాజాగా ఆదివారం నుమాయిష్‌లో ఏర్పాటు చేసిన క్రేజీ వీల్ ట్రాలీ రన్నింగ్‌లోనే విరిగి కింద పడడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రగాయాలపాలయ్యారు. అందులో ఓ వ్యక్తి కిందపడ్డ తర్వాత ట్రాలీలోనే కొద్దిసేపటి వరకు ఇరుక్కుపోయి నరకయాతన అనుభవించాడు. ఎగ్జిబిషన్‌కు వేల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. అయితే ఆ ప్రాంతంలో కనీస వైద్యసదుపాయాలు సైతం ఏర్పాటు చేయలేదని సందర్శకులు ఆరోపిస్తున్నారు. జరగరానిది ఏదైనా జరిగితే వెంటనే ప్రథమ చికిత్స చేసేందుకు సైతం ఎలాంటి ఏర్పాటు చేయలేదని వారంటున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు సకల సౌకర్యాలు..



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** తెలంగాణ ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తుందని కోనాపూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చౌడారపు రాంప్రసాద్ తెలిపారు. సోమవారం కోనాపూర్ గ్రామపంచాయతీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డిజిటల్ తరగతి గదుల్లో ఆధునిక సాంకేతికతతో కూడిన ప్రొజెక్టర్లు, స్మార్ట్ బోర్డుల ద్వారా విద్యార్థులను బోధిస్తున్నామన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం, పాఠశాల భవనాలకు రంగులు వేయడం, గ్రీనరీ (మొక్కలు, కిచెన్ గార్డెన్లు) పెంచడం ద్వారా స్కూళ్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సర్కారు స్కూళ్లలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు, బాలబాలికలకు ప్రత్యేకమైన మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్, వర్క్ బుక్స్, నోట్‌బుక్స్, అభ్యాస దీపికలను పంపిణీ చేస్తున్నారన్నారు. అలాగే కోనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో కోనాపూర్ సర్పంచ్ రిక్కల అరుణ్ రెడ్డి, ఉప సర్పంచ్ మోర్తాడ్ ఉదయ్, పంచాయతీ కార్యదర్శి నవీన్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.